పుట్టెడు దు:ఖంలో పరీక్షకు..

మంచర్ల శ్రీలత

కన్నెపల్లి, మార్చి 21 : తండ్రిని కోల్పోయిన ఓ విద్యార్థిని పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని పదో తరగతి పరీక్ష రాసిన ఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన మంచర్ల శ్రీలత కన్నెపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. ఆమె తండ్రి మల్లయ్య గురువారం మృతిచెందాడు. శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాగా, విద్యార్థిని శ్రీలత ఓ వైపు తండ్రి అంత్యక్రియలు జరుగుతుండగా చదువుపై ఉన్న మక్కువతో పరీక్షకు హాజరైంది.

తెలుగుకు బదులు హిందీ పేపర్!

మంచిర్యాల, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఒక ప్రశ్నపత్రానికి బదులు మరో ప్రశ్నపత్రం పంపిణీ చేయడంతో పదో తరగతి తెలుగు పరీక్ష రెండు గంటలు ఆలస్యంగా జరిగిన ఘటన మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పరీక్ష ప్రారంభానికి ముందు ట్రంక్ బాక్స్‌లో వచ్చిన ప్రశ్నపత్రాలను సీఎస్ ఓపెన్ చేసి చూడగా డే-1(తెలుగు) పరీక్ష పత్రాలకు బదులు డే-2(హిందీ) ప్రశ్నపత్రాలు వచ్చినట్టు గుర్తించారు. డీఈవో యాదయ్య కలెక్టర్ కుమార్‌దీపక్‌కు సమాచారం అందించారు. పరీక్ష కేంద్రానికి చేరుకున్న కలెక్టర్ ఆరా తీశారు. పరీక్ష కేంద్రానికి వచ్చిన డే-2 ప్రశ్నపత్రాలను తిరిగి పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, డే-1 పేపర్‌ను తీసుకొచ్చి పరీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ వార్తలను ఖండించారు. మంచిర్యాల పీఎస్ నుంచి 9 సెంటర్లకు ప్రశ్నపత్రాలు వెళ్లాయని, ఇందులో ఒక సెంటర్‌కు వచ్చిన ట్రంక్ బాక్స్‌లో డే-1 పేపర్‌కు బదులు డే-2 పేపర్ పంపించారని వెల్లడించారు. పొరపాటు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రూప్-1 పేపర్లు మళ్లీ దిద్దాల్సిందే

- టీజీపీఎస్సీ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- అభ్యర్థుల్లో అనేక అనుమానాలున్నాయి
- జీఆర్ఎల్ ఎందుకు విడుదల చేయలేదు?
- మార్కులు గోప్యంగా ఉంచడమెందుకు?
- సోషియాలజీ బోధించే వారితో ఎనకామీ పేపర్లు ఎలా దిద్దిస్తరు?
- 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను రీ వాల్యుయేషన్ చేయించాల్సిందేనని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. లోపభూయిష్టంగా ఉన్న మెయిన్స్ ఆన్సర్‌షీట్లను రీ వాల్యుయేషన్ చేసే వరకు పోరాడుతామని స్పష్టంచేశారు. 20,100 మంది అభ్యర్థుల పేపర్లను పునః మూల్యాంకనం చేయించాల్సిందేనని పునరుద్ఘాటించారు. గ్రూప్-1 రగడ నేపథ్యంలో శుక్రవారం ప్రసన్న హరికృష్ణ 'నమస్తే తెలంగాణ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'టీజీపీఎస్సీ ప్రతిభావంతులకు పట్టంకడతామని ఇటీవల ప్రకటించింది. అసలైన ప్రతిభావంతులను తేల్చేందుకు మరోసారి వాల్యుయేషన్ చేస్తే, మరో మూడు నెలల ఆలస్యంగా ఫలితాలు ప్రకటిస్తే తప్పేంకాదు. గ్రూప్-1 నోటిఫికేషన్ 13 ఏండ్ల తర్వాత వచ్చింది. 60 ఏండ్ల భవిష్యత్తును నిర్దేశించేందుకు రీ వాల్యుయేషన్ చేస్తే ఇబ్బందేమీరాదు. టీజీపీఎస్సీ పారదర్శకంగా, జవాబుదారీతనంగా వ్యవహరించి, నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి' అని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

జీఆర్ఎల్‌ను ఎందుకు వెల్లడించలేదు ?

రిజల్ట్స్‌లో భాగంగా జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్) విడుదల చేస్తున్న టీజీపీఎస్సీ, గ్రూప్-1 మెయిన్స్ జీఆర్ఎల్‌ను ఎందుకు విడుదల చేయలేదు? వారం వ్యవధిలో గ్రూప్-2, గ్రూప్-3 జీఆర్ఎల్ విడుదల చేసిన కమిషన్ గ్రూప్-1 మెయిన్స్ జీఆర్ఎల్‌ను విడుదల చేయలేదంటేనే ఏదో గూడుపుఠాణి దాగి ఉన్నది. మెయిన్స్ మార్కులను కేవలం అభ్యర్థి లాగిన్ ఐడీలో ఎందుకు పొందుపరిచారు? పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదు?

తెలుగులో రాసిన వారికి తీరని అన్యాయం

గ్రూప్-1 మెయిన్స్ తెలుగు మీడియంలో రాసిన వారికి 50-100 వరకు తక్కువ మార్కులేశారు. ఇంగ్లిష్ మీడియంలో రాసిన వారికి ఎక్కువ మార్కులేశారు. దీంతో తెలుగులో రాసిన వారికి తీవ్ర అన్యాయం జరిగింది. తెలుగు మీడియంలో రాయడమే తప్పా? చాలా సీరియస్‌గా ప్రిపేర్ అయిన వారికి అంచనాల కంటే 100 మార్కులు తగ్గాయి. ఇది అనుమానాలకు తావిస్తున్నది. టాప్-100లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు ఎందరున్నారో ఎందుకు బయటపెట్టడంలేదు. టాప్-100లో ఎస్సీలు ముగ్గురే ఉన్నారు. ఎస్టీల సంఖ్య అతి తక్కువగా ఉన్నది. ఐఏఎస్ తర్వాత అత్యంత కీలకమైన ఉద్యోగాల భర్తీలో సామాజిక న్యాయం జరగకపోతే, ఉద్యోగాలు భర్తీచేసి ఏం లాభం?

జీవో-29తో సామాజిక న్యాయం జరగలె

గతంలో బీఆర్ఎస్ సర్కారు జారీచేసిన జీవో-55తో సామాజిక న్యాయం జరిగింది. ఈ జీవోను పక్కనపెట్టి కాంగ్రెస్ సర్కారు జీవో-29 తెచ్చింది. ఇది సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉన్నది. ఈ జీవో ఇచ్చినట్టు ఎవరికీ తెలియదు. 2024 ఫిబ్రవరిలో గ్రూప్-1 రీ నోటిఫికేషన్ ఇస్తే, ప్రిలిమ్స్ పరీక్ష తర్వాత ఆగస్టులో జీవో-29ని వెబ్‌సైట్‌లో పెట్టారు. ఇంత గోప్యత, రహస్యం ఎందుకు?

ఆంధ్రా వాళ్లకెలా అప్పగిస్తారు?

మూల్యాంకన బాధ్యతలను కొందరు ఆంధ్రా వాళ్లకు అప్పగించినట్టు తెలిసింది. తెలంగాణ ఉద్యమ చరిత్ర-రాష్ట్రావతరణ పేపర్ మూల్యాంకనాన్ని కోఠి మహిళా కాలేజీలో పనిచేసే ఆంధ్రా మూలాలున్న అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అప్పగించినట్టు వార్తలొచ్చాయి. అసిస్టెంట్ ప్రొఫెసరేమో చీఫ్ ఎగ్జామినర్ (సీఈ) అయితే, ప్రొఫెసర్లకు ఎగ్జామినర్ విధులు కేటాయించారు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ కింద ప్రొఫెసర్ పనిచేస్తారా? ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా? సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ తనకు కావాల్సిన వాళ్లకు నచ్చినట్టుగా మార్కులేసినట్టు ప్రచారం జరుగుతున్నది. పదేండ్ల క్రితం రూపొందించిన పాఠాలను బోధించే వారిచేత మెయిన్స్ మూల్యాంకనం చేయించడమే దౌర్భాగ్యం.

లోపాలపుట్టగా మూల్యాంకనం

మెయిన్స్ మూల్యాంకనం మొత్తం లోపాలపుట్ట అని, మొదటిసారి మూల్యాంకనంలో తక్కువ మార్కులేశారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎవరికీ క్వాలిఫై మార్కులు రాలేని పరిస్థితి ఉండటంతో తర్వాత లిబరల్‌గా దిద్దారని చెప్తున్నారు. ఓసీలకు 40%, బీసీలకు 35%, ఎస్సీ ఎస్టీలకు 30% మార్కులొస్తే క్వాలిఫై అయినట్టు లెక్క. మొదటి స్పెల్‌లో దిద్దిన పేపర్లకు, రెండో స్పెల్‌లో దిద్దిన పేర్లకు మార్కుల అంతరం పెరిగిందనే వాదన వినిపిస్తున్నది. చాలామందికి అయితే తక్కువ గా, లేదంటే ఎక్కువగా మార్కులొచ్చాయన్న ఆందోళనలు నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఎకానమీ పేపర్.. సోషియాలజీ బోధించేవారితోనా?

ప్రొఫెసర్లతో చేయించాల్సిన మూల్యాంకనాన్ని డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల చేత చేయించినట్టు ప్రచారం జరుగుతున్నది. మూల్యాంకనంలో రోజుకు 20 పేపర్లు మాత్రమే చేయాల్సి ఉండగా, 60 పేపర్లు ఇచ్చినట్టు, చివరి 10-15 రోజుల్లో రోజుకు 100 పేపర్లు దిద్దించినట్టు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎకానమీ పేపర్‌ను సోషియాలజీ ఫ్యాకల్టీ చేత మూల్యాంకనం చేయించినట్టు, బ్లూప్రింట్‌ను ఇంగ్లిష్‌లో రూపొందించి, తెలుగు కోసం గూగుల్ ట్రాన్స్‌లేట్ చేసి ఇచ్చినట్టు తెలిసింది. ఇంతకన్నా ఘోరం మరొకటి ఉంటుందా?

గ్రూప్-1పై సందేహాలెన్నో?

- ముదురుతున్న గ్రూప్-1 వివాదం
- రీవాల్యుయేషన్‌కు పెరుగుతున్న డిమాండ్
- టీజీపీఎస్సీ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదుల వెల్లువ
- హైకోర్టును ఆశ్రయించే యోచనలో అభ్యర్థులు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల వివాదం మరింతగా ముదురుతున్నది. ఫలితాలపై రోజుకో రగడ జరుగుతున్నది. టీజీపీఎస్సీ గ్రీవెన్స్ సెల్‌కు వివిధ అంశాలపై అభ్యర్థుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను చూసుకున్న పలువురు అభ్యర్థులు నివ్వెరపోవాల్సిన పరిస్థితి. ఆనాటి నుంచే తమకు అన్యాయం జరిగిందని వందలాది మంది అభ్యర్థులు రగిలిపోతున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల నుంచి మెయిన్స్ పేపర్ల రీ-వాల్యుయేషన్ డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. తెలుగులో రాసిన తమకు తక్కువ మార్కులొచ్చాయని, ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులకే ఎక్కువ మార్కులేశారని తెలుగు మీడియా అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. వివిధ అంశాలపై గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు అందజేశారు. కొందరు అభ్యర్థులు ఏకంగా గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వరకు 448 టీజీపీఎస్సీకి ఫిర్యాదు చేశారు. కొందరు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా సీఎం రేవంత్‌ను కలిసేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. అయినా న్యాయం జరగదనే భావనలో ఉన్న వందలాది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇటీవలే ఇందిరా పార్క్‌లో సమావేశమైన అభ్యర్థులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

మండలిలో లేవనెత్తిన ఎమ్మెల్సీ కవిత

పలువురు అభ్యర్థులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆశ్రయించారు. తమకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని కోరారు. స్పందించిన కవిత గ్రూప్-1 మెయిన్స్ పేపర్లను రీ వాల్యుయేషన్ చేయాలని ఇటీవల మండలిలో డిమాండ్ చేశారు. గ్రూప్-1 జీఆర్ఎల్ విడుదల చేయకపోవడం, గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు విడుదల చేయడం వంటి అంశాలను ఆమె లేవనెత్తారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ సైతం ఆరోపణలు గుప్పించారు. గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఏకంగా పోటీ పరీక్షల శిక్షకుడు అశోక్‌కుమార్ ఆరోపించారు. కోర్టు కేసులు ఉండగా, 6 నెలల్లో చేయాల్సిన వాల్యుయేషన్‌ను మూడు నెలల్లో ఎలా ముగించేస్తారంటూ ఆయన ప్రశ్నించారు.

పలువురు అభ్యర్థుల అభ్యంతరాలు ఇవే

- ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులకు ఎక్కువ మార్కులు రాగా, తెలుగు అభ్యర్థులకు తక్కువ మార్కులు వచ్చాయి.
- టాప్ 100, టాప్ 500 ర్యాంకుల్లో తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారు.
- మెయిన్స్ మూల్యాంకనంలో కంటెంట్, విశ్లేషణ కంటే చక్కటి చేతి రాతకు అందంగా రాసిన వారికి, ఎక్కువ మార్కులు వేశారు.
- దశాబ్దకాలంగా గ్రూప్-1కి సిద్ధమవుతున్న, తెలంగాణ ఉద్యమంపై అవగాహన ఉన్న వారితో పోల్చితే 2023లో బీటెక్ పూర్తిచేసిన వారికి ఎక్కువ మార్కులు రావడం ఎలా సాధ్యం. అవగాహన లేని కొందరికి ఎక్కువ మార్కులెలా వస్తాయి?
- ఉమ్మడి ఏపీలో 6,000 జవాబుపత్రాలను మూల్యాంకనం చేసేందుకు 3 నెలలు పట్టింది. ఇక్కడ 20 వేల జవాబు పత్రాలకు 3 నెల్లోనే మూల్యాంకనం సాధ్యమేనా.
- వర్సిటీ ప్రొఫెసర్ల చేత మూల్యాంకనం చేయించారనేది శుద్ధ అబద్ధం. డిగ్రీ, ఎయిడెడ్ కాలేజీల లెక్చరర్లతో మమ అనిపించేశారు.
- తెలంగాణ ఉద్యమం పేపర్లను హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ఫ్యాకల్టీతో మూల్యాంకనం చేయించారు.
- పేపర్-1 జనరల్ ఎస్సేను కెమిస్ట్రీ, ఎకనామిక్స్ ఫ్యాకల్టీతో చేయించారు. సొసైటీ పేపర్‌ను పొలిటికల్ సైన్స్ ఫ్యాకల్టీతో, ఎన్విరాన్‌మెంట్ సెక్షన్‌ను ఎకనామిక్స్ ఫ్యాకల్టీతో చేయించారు.
- దాదాపు 3,000 పేపర్లను మూడోసారి మూల్యాంకనం చేశారు. ఈ బాధ్యతలను పాతవారికే అప్పగించారు.

సిద్దిపేట జిల్లా దుద్దెడలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న కోరుకంటి, వంటేరు

అపర భగీరథుడు కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్
- సిద్దిపేటకు చేరిన 'గోదావరి కన్నీటి గోస' మహాపాదయాత్ర

సిద్దిపేట అర్బన్, మార్చి 21: తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం కావాలన్న సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన అపర భగీరథుడు కేసీఆర్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. 'గోదావరి కన్నీటి గోస' పేరుతో గోదావరి నది నుంచి కొండపోచమ్మసాగర్ వరకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన మహా పాదయాత్ర గురువారం రాత్రి సిద్దిపేట పట్టణానికి చేరింది. శుక్రవారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆయన మీడియా సమావేశం లో మాట్లాడుతూ.. ప్రతి ఎకరాకు నీళ్లు అందించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం నిర్మిస్తే.. కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధపు ప్రచారాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా గోదావరి నదిలో నీళ్లు నింపకపోతే తాము ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

- ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి



రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1లోగా నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే నిరుద్యోగులతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారీ సింహగర్జన నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

- బండరాళ్లు తలపై పెట్టుకొని దివ్యాంగుల నిరసన

రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీరుకు నిరసనగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలోని కందగట్ల లో శుక్రవారం బండరాళ్లు తలపై పెట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి పైసా నిధులు కేటాయించకుండా చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు.

– ఆత్మకూర్.ఎస్

- వేతనాలు చెల్లించాలని భగీరథ కార్మికుల ధర్నా

వేతనాలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ వద్ద శుక్రవారం ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాలకు చెందిన కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రతి కార్మికుడికి వెంటనే ఐడీ కార్డు ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. –ఏటూరునాగారం

కొత్త దరఖాస్తులకే 'యువ వికాసం'!

- గత దరఖాస్తుదారులకు నో చాన్స్
- ఇప్పటికే బీసీబంధు కోసం 5.28 లక్షలు, మైనార్టీ బంధుకు 2.16 లక్షలు నమోదు
- ఆ దరఖాస్తులన్నింటినీ పక్కనబెట్టిన సర్కార్
- మళ్లీ ఆన్‌లైన్‌లోనే అర్జీల స్వీకరణ
- గతంలో ఇచ్చింది రూ. లక్ష రుణమే
- తాజాగా సబ్సిడీపై రూ.4 లక్షల వరకు రుణం


హిమాయత్‌నగర్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో గిరిజన సంఘాల జేఏసీ నేతలు

ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి

గిరిజన సంఘాల జేఏసీ నేతల డిమాండ్

ప్రభుత్వం ట్రైకార్ రుణ బకాయిలను తక్షణమే చెల్లించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 7న చలో సంక్షేమ భవన్ కార్యక్రమానికి గిరిజన సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. హిమాయత్‌నగర్‌లో తెలంగాణ గిరిజన సమాఖ్య, తెలంగాణ గిరిజన సంఘం నేతలు శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. వివిధ గిరిజన సంఘాల నేతలు ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరుతో నూతన పథకాన్ని హడావుడిగా ప్రారంభించడంపై అనుమానాలు వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 మధ్య గిరిజన యువత నుంచి దరఖాస్తులను స్వీకరించిందని, అందులో 30 వేల మందికి రుణాలు మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి రూ.219 కోట్ల విలువైన చెక్కులను సిద్ధం చేసి క్లియరెన్స్ కోసం ఆర్థికశాఖకు పంపిందని వివరించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రుణాలను రద్దు చేయాలనే కుట్ర చేస్తున్నదని గిరిజన సంఘాలు నేతలు ఆరోపించారు. పాత బకాయిలు చెల్లించకుండా రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టడంపై ఆందోళన కలుగుతున్నదని తెలిపారు. యువవికాసం పథకంలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటే తిరస్కరణకు గురవుతున్నాయని వాపోయారు. ఏప్రిల్ 5లోగా ట్రైకార్ రుణ బకాయిలను విడుదల చేయాలని, లేదంటే 7న సంక్షేమ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన నాయకులు శ్రీరామ్ నాయక్, రాంనాయక్, రాంబాల్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

హైదరాబాద్, మార్చి21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఎంతో ఊరించిన రాజీవ్ యువవికాసం పథకం యువతను ఉసూరుమనిపిస్తున్నది. కొత్తవారికే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న 7.44 లక్షల మందికి అవకాశం ఇవ్వడంలేదు. నిరుద్యోగ యువత స్వయంఉపాధి కోసం ఆర్థికసాయం చేయాలని సర్కారు ఈ రాజీవ్ యువవికాసం పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా రూ.6 వేల కోట్లను సబ్సిడీ రుణాలుగా ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.2,000 కోట్లు, ఎస్టీ కార్పొరేషన్ కింద రూ.1,360 కోట్లు, బీసీ కార్పొరేషన్ కింద రూ. 1,800 కోట్లు, మైనార్టీ కార్పొరేషన్ కింద రూ.840 కోట్లను మొత్తంగా రూ.6,0 00 కోట్లను పొందుపరిచింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది. ఏప్రిల్ 4 వరకు తుది గడువును విధించింది. జూన్ 2లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థికసాయాన్ని అందిస్తామని వెల్లడించింది.

గతంలో దరఖాస్తులు ఇలా..

బీసీబంధు, మైనార్టీబంధు కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న 7,44,862 మందికి ప్రస్తుత రాజీవ్ యువవికాసం పథకంలో అవకాశం దక్కడం లేదు. బీసీ కులవృత్తిదారులకు బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.లక్ష వరకు ఆర్థికసాయాన్ని అందించేందుకు గత బీఆర్ఎస్ సర్కారు బీసీబంధు పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 5,28,862 దరఖాస్తులు రాగా, 4.13 లక్షల మందిని రూ.1 లక్ష ఆర్థిక సాయానికి అర్హులుగా అప్పటి ప్రభుత్వం గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికల వరకు 40 వేల మంది వృత్తిదారులకు ఆర్థికసాయాన్ని అందించింది. మిగతా 3.73 లక్షల మందికి సైతం ప్రతినెలా 15న అందించాలని ప్రణాళిక రూపొందించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ పథకాన్ని అటకెక్కించింది. ఆ దరఖాస్తులన్నింటినీ పక్కనబెట్టింది. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఎకనామిక్ సపోర్ట్ పథకం కింద అర్హులైన మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని గత బీఆర్ఎస్ సర్కార్ నిర్ణయించింది. ఆ పథకానికి 2.16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలివిడతలో 11 వేల మందికిపైగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొలివిడతలో 4,500 మందికి, మిగతా జిల్లాల్లో 6,500 మందికి చెక్కులను మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు పథకాలను ప్రస్తుతం నిలిపేసింది. రాజీవ్ యువవికాసం పథకంలో మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని లేకుండా చేసింది. మిగిలిన 5.28లక్షల మంది బీసీ, 2.16 లక్షల మంది మైనార్టీలకు అన్యాయం జరుగుతుంది.

ఆధార్ నంబర్ ఎంట్రీ చేయగానే రిజెక్ట్

ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఓబీఎంఎంఎస్ (ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నది. అందులో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు ఎంటర్ కావడం లేదు. పేరు నమోదు చేసి, ఆధార్ నంబర్‌ను ఎంట్రీ చేయగానే, ఆటోమెటిక్‌గా రేషన్‌కార్డు నంబర్ కూడా ప్రత్యక్షం అవుతున్నది. ఆయా నంబర్లు ఇప్పటికే రిజిస్టర్డ్ అయ్యి ఉన్నాయని పేర్కొంటూ ఆ సైట్ క్లోజ్ అవుతున్నది. దీంతో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం లేకుండా పోయింది.

స్పష్టత ఇవ్వని సర్కారు

రాజీవ్ యువవికాసం పథకం కింద గతం లో రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను సైతం పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? అనే అంశంపై సర్కారు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గతంలో బ్యాంకు లింకేజీ లేకుండా 100 శాతం సబ్సిడీతో బీసీ, మైనార్టీ బంధు కింద రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు 60 శాతం, 70 శాతం సబ్సిడీపై 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందిస్తున్నది. రుణం మొత్తాన్ని పెంచింది. కొత్తవారికే అవకాశం ఇవ్వడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు.

'పోచారం'నకు వ్యతిరేకంగా ధర్నా

- కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నేతల బైఠాయింపు
- నిధుల విషయంలో ఇబ్బందులపై ఆగ్రహం
- కాంట్రాక్టర్ మృతదేహంతో ఆందోళనకు యత్నం
- బాన్సువాడ కాంగ్రెస్‌లో ముదిరిన లొల్లి

కంఠేశ్వర్, మార్చి 21:మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఆందోళనకు దిగాయి. కాంట్రాక్టులు, బిల్లులు విషయంలో సతాయిస్తున్నారంటూ నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 300 మందికి పైగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు పోచారం డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పార్టీలో తమకు తగిన గుర్తింపు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆందోళన బాటపట్టారు. కాంట్రాక్ట్, నిధుల మంజూరు విషయంలో ఒత్తిడికి గురై బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ గుండెపోటుతో మరణించాడని తెలిపారు. మృతదేహంతో కలెక్టరేట్ ఎదుట బైఠాయించాలని నిర్ణయించుకున్న కాంగ్రెస్ శ్రేణులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని నిజామాబాద్‌కు వచ్చారు. పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి బయటకు తీయకుండా అడ్డుకోడంతో కార్యకర్తలు కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నాకు దిగారు. ఆందోళన అనంతరం అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిశ